క్లుప్తంగా

జీసీసీ మేనేజర్‌గా నర్సింహారావు బాధ్యతలు



పాల్వంచరూరల్: గిరిజన సహకార సంస్థ పాల్వంచ బ్రాంచ్ మేనేజర్‌గా ఎస్.నర్సింహారావు శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ సేల్స్‌మెన్లు, కార్యాలయం సిబ్బందితో సమావేశమై మాట్లాడారు. బ్రాంచ్ పరిధిలో విధులు నిర్వహించే ఉద్యోగులు సమన్వయంతో పనిచేయాలని అందరి సహాయ సాకారాలతో సంస్థ అభివృద్ధికి కృషిచేస్తామన్నారు.

ఏజీఎంకు వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): 11వ వేతన ఒప్పందం ప్రకారం పెరిగిన ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్‌లు (టీఏ) డియర్‌నెస్ అలవెన్సులు సవరించాలని ఈఈ సెల్ హెచ్‌వోడీ, ఏజీఎం మురళీధర్ రావును సీఐటీయూ నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఇందుకు సంబంధించిన కాపీని సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరామ్‌కు ఫ్యాక్స్‌ద్వారా అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి మందా నర్సింహారావు, బ్రాంచి కార్యదర్శి విజయగిరి శ్రీనివాస్, వై. వెంకటేశ్వరరావు, అల్లి రాజేందర్ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

టేకులపల్లి: ఇట్స్ చారిటీ టైమ్, ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ కమిటీ సిబ్బంది ఆధ్వర్యంలో అమృత హాస్పిటల్, ఏజీఎస్ హాస్పిటల్(కొత్తగూడెం), అపోలో ల్యాబ్‌ల సౌజన్యంతో మండలంలోని కొప్పురాయి, ఇప్పలచెలక, ఒడ్డుగూడెం గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరం విజయవంతమైంది. ఈ సందర్భంగా 325 మందికి ఉచితంగా వైద్య, దంత, రక్త పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు నరేష్‌కుమార్, రంజిత్, వైద్యులు బాబురావు, జయ, కవిత, ల్యాబ్ టెక్నీషియన్లు ప్రసన్న, చందన, మధు, గోపి, పీఆర్‌వో చంద్రకళ పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ కళాశాలలో 23న స్పాట్ అడ్మిషన్లు

పాల్వంచరూరల్: సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు ఈనెల 23న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ బి.ఝాన్సీరాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక పట్టణంలోని మహిళా డిగ్రీకళాశాలలో 2025–2026 సంవత్సరానికిగాను బీఏ(హెచ్‌ఈపీ), బీకాం, కంప్యూటర్ అప్లికేషన్స్, జనరల్, బీఎస్సీ, (ఎంపీసీ), (ఎంఎస్‌సీఎస్), (ఎంపీసీఎస్), బీజెడ్సీ, ఎంజెడ్సీ కోర్సుల్లో సీట్లు పొందేందుకు ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఉత్తీర్ణులైన విద్యార్థినులు, సంబంధిత సర్టిఫికెట్లను తీసుకుని కళాశాల ప్రాంగణంలో నిర్వహించే అడ్మిషన్లకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 లోపు హాజరుకావాలని కోరారు.

ఆటోడ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

జూలూరుపాడు: ఆటోడ్రైవర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ ఆటోవర్కర్స్ యూనియన్ల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మందా రవికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని పడమటనర్సాపురంలో తెలంగాణ ఆటో వర్కర్స్ యూనియన్ల జేఏసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని, సమస్యల పరిష్కారానికి పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. యూనియన్ల జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇందోజు బసవచారి, రాష్ట్ర కార్యదర్శి బానోత్ నాగేశ్వరరావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి సముద్రాల తిరుమలరావు, జిల్లా అధ్యక్షులు కామిశెట్టి సైదులు, జిల్లా ఉపాధ్యక్షుడు బానోత్ భగ్య నాయక్, జిల్లా కార్యదర్శి బానోత్ శివ పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌ను ఆపాలి

సింగరేణి(కొత్తగూడెం): ఆపరేషన్ కగార్ పేరిట సాగిస్తున్న హత్యకాండలను వెంటనే ఆపాలని, మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలని పలు రాజకీయ పార్టీల నేతలు అన్నారు. ఈ మేరకు శుక్రవారం కొత్తగూడెంలోని రైటర్ బస్తీలోగల కార్యాలయంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో టీజేఎస్ నాయకులు మల్లెల రామనాథం మాట్లాడుతూ.... మావోయిస్టు కేంద్ర కమిటీ చర్చలకు వస్తామని లేఖలు పంపినా కేంద్రం పెడచెవిన పెట్టినట్టుగా వ్యవహరిస్తున్నారన్నారు. శాంతిచర్చలు కోరుతూ ఈనెల 14న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గౌని నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, జాటోత్ కృష్ణ, రమేష్, గోపాలరావు, రాజశేఖర్, ప్రణయ్ కుమార్, శివ తదితరులు పాల్గొన్నారు.

ఈతకు సంరక్షణ కరువు..

చెరువుగట్లపై కనిపించని ఈత వనాలు

- ఏటా నర్సరీల్లో వెయ్యికి పైగా మొక్కలు పెంపకం
- విరివిగా నాటుతున్న ఎక్సైజ్ అధికారులు
- నిర్వహణ లేక ఎండిపోతున్న వైనం

ఇల్లెందురూరల్: ఒకప్పుడు పల్లెల్లో చెరువు గట్లు ఈత చెట్లతో నిండి ఉండేవి. వేసవి సెలవుల్లో యువత కట్ట వద్దకు చేరుకొని ఈతపండ్లు తింటూ సరదాగా గడిపేవారు. కానీ చెరువుల పునరుద్ధరణ పనులతో చెరువు గట్లపై ఈత మొక్కలు కనుమరుగయ్యాయి. తిరిగి చెరువు గట్లపై ఈత మొక్కలను పెంచాలన్న ఆకాంక్షతో ఎక్సైజ్ అధికారులు ఏటా విరివిగా నాటుతున్నారు కానీ నిర్వహణ లేక నాటిన కొద్ది రోజులకే ఎండిపోతున్నాయి. ఈ కారణంగా పల్లెల్లో ఈత చెట్లు క్రమంగా కనుమరుగయ్యే పరిస్థితి నెలకొంది.

ఏటా మొక్కలు నాటుతున్నా...

పంచాయతీల నర్సరీల్లో ప్రత్యేకంగా పెంచిన ఈత మొక్కలను వర్షాలు సమృద్ధిగా కురిసిన తరువాత హరితహారం పేరుతో విరివిగా నాటుతుంటారు. ఈ క్రమంలోనే ఎక్సైజ్, పంచాయతీ, ఎన్ఆర్ఈజీఎస్ శాఖల అధికారులు సంయుక్తంగా ఈత మొక్కలను పల్లెల్లో చెరువు గట్ల వెంట ఏటా విరివిగా నాటుతున్నారు. ఇలా గట్టుపై నాటే ఈత మొక్కల సంరక్షణకు ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో భాగంగా రెండేళ్ల పాటు నిర్వహణ పేరుతో నిధులు మంజూరవుతుంటాయి. కానీ ఇతర మొక్కలను తనిఖీ చేసినట్లుగా ఈత మొక్కలను అటు ఎక్సైజ్ అధికారులు ఇటు పంచాయతీరాజ్ శాఖ అధికారులు ఎవరూ పరిశీలించకపోవడంతో కూలీలు సైతం వాటి నిర్వహణను అంతగా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి. ఫలితంగా నాటిన తరువాత నిర్వహణ లేక ఏటా చెరువు గట్లపై నాటిన ఈత మొక్కలు క్రమంగా కనుమరుగవుతున్నాయి. చెరువు గట్లపై పూర్వం మాదిరిగా ఈత చెట్లను పెంచాలన్న ఎక్సైజ్ శాఖ ఆకాంక్ష కనుచూపుమేరలో సాధ్యమయ్యేలా కనిపించడం లేదు.



పోలారం నర్సరీలో నాటేందుకు సిద్ధంగా ఉన్న ఈత మొక్కలు

బహుళ ప్రయోజనకారి..

ఈతచెట్టు బహుళ ప్రయోజనకారి. ఈత చెట్టు నాలుగు అడుగుల నుంచి పదిహేను అడుగుల కంటే ఎత్తు పెరగదు. అందుకే చెరువు కట్టలు భారీ వర్షాలకు కోతకు గురికాకుండా ఈత చెట్లను పెంచుతుంటారు. ఈత పండ్లలో కాల్షియం పుష్కలంగా ఉండటంతో ఎముకలు బలపడి, జీర్ణశక్తి, ఆలోచన శక్తి కూడా పెరుగుతుంది. ఈత పండ్లు, ఈత కల్లులో ఐరన్ సమృద్ధిగా ఉండటం వల్ల రక్తవృద్ధి జరుగుతుంది. అలాగే నిస్సత్తువ, అలసట వంటివి తగ్గుతాయి. చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించే శక్తి ఈతపండ్లకు ఉంటుంది. వేసవిలో శరీర వేడిని తగ్గిస్తుంది. ఇంతే కాకుండా వేసవిలో ఈత కల్లును అమ్ముకొని గీత కార్మికులు సైతం ఉపాధి పొందుతుంటారు.

స్పందిస్తేనే ప్రతిఫలం..

ప్రస్తుతం వర్షాలు సమృద్ధిగా కురవడంతో నేల కూడా తేమను ఆవహించింది. రోహిణికార్తె ముగియగానే ఒక మంచి వర్షం కురిస్తే హరితహారం పథకం ప్రారంభించేందుకు ప్రభుత్వం కూడా సిద్ధంగా ఉంది. గతం మాదిరిగా ఈ ఏడాది కూడా నర్సరీల్లో ఈత మొక్కలను విరివిగా పెంచుతున్నారు. మండలంలోని పలు నర్సరీల్లో ఈ ఏడాది 700 మొక్కలను పంచాయతీ అధికారులు నాటేందుకు సిద్ధం చేశారు. అయితే గతం మాదిరిగా చెరువు గట్లపై నాటి వదిలేయకుండా.. నిర్వహణ బాధ్యతను నిరంతరం పర్యవేక్షించడం, నాటిన మొక్కలకు కొద్దికాలమైనా ట్రీగార్డులు ఏర్పాటు చేయడం వంటి పనులు చేపడితే గట్లపై కొన్ని మొక్కలైనా జీవం పోసుకునే అవకాశం ఉంటుంది. తద్వారా చెరువు గట్లు కోతకు గురికాకుండా రక్షణ పొందడంతోపాటు వాటి ద్వారా వచ్చే ఫలసాయం ప్రజల ఆరోగ్యం మెరుగుదలకు తోడ్పడుతుంది. గీత కార్మికులకు కూడా ఉపాధి కలుగుతుంది.



బొజ్జాయిగూడెం నర్సరీలో

సంరక్షణపై దృష్టిసారిస్తాం



చెరువుగట్ల వెంట నాటిన ఈత మొక్కల సంరక్షణపై ఈ దఫా దృష్టిసారిస్తాం. ఇతర మొక్కల మాదిరిగా నిరంతరం పర్యవేక్షిస్తాం. ఈజీఎస్ ద్వారా నియమించబడిన వాచర్ల సహాయంతో మొక్కలకు కంచె ఏర్పాటు చేయించి సంరక్షణ పటిష్టంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటాం.

– ధన్‌సింగ్, ఎంపీడీవో, ఇల్లెందు

‘భూ భారతి’తో రైతులందరికీ మేలు

- ఎమ్మెల్యే రాందాస్ నాయక్

జూలూరుపాడు: భూ భారతి చట్టంతో రైతులందరికీ మేలు జరుగుతుందని వైరా ఎమ్మెల్యే మాళోత్ రాందాస్‌నాయక్ అన్నారు. మండలంలోని పడమటనర్సాపురం పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన భూ భారతి రెవెన్యూ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ... బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి పోర్టల్‌లో అనుభవదారుడి కాలమ్ లేకపోవడంతో రైతులు ఎన్నో ఇబ్బందులు పడ్డారని, కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం ధరణి పోర్టల్‌లో ఉన్న పొరపాట్లను తొలగించి, భూ భారతి పోర్టల్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకరావడం జరిగిందన్నారు. భూభారతితో సమస్యలన్నీ తొలిగిపోయి రైతులకు మంచి రోజులు వచ్చాయన్నారు. అనంతరం రైతుల నుంచి ఎమ్మెల్యే దరఖాస్తులు స్వీకరించారు. తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ డి.కరుణాకర్ రెడ్డి, సీఐ ఇంద్రసేనా రెడ్డి, ఎస్సై బాదావత్ రవి, పశువైద్యాధికారి బానోత్ బద్దూలాల్, నాయకులు లేళ్ల వెంకటరెడ్డి, మండల అధ్యక్షుడు మాళోత్ మంగీలాల్ నాయక్, లేళ్ల గోపాల్ రెడ్డి, మధుసూదన్‌రావు, హరీష్, గోసు రామారావు, నగేష్, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్

పాల్వంచరూరల్: మండలంలో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సుల్లో 434 దరఖాస్తులు స్వీకరించినట్లు తహసీల్దార్ దారా ప్రసాద్ తెలిపారు. పాల్వంచలో 282, నారాయణరావుపేటలో 95, ఉల్వనూరులో 57 దరఖాస్తులు అందాయన్నారు.

ఇల్లెందురూరల్: మండలంలోని రేపల్లెవాడ, పూబెల్లి గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రవికుమార్ మాట్లాడుతూ.. అర్హత ఉండి పట్టాదారు పాస్‌పుస్తకం మంజూరు కాని వారు, గతంలో జారీ చేసిన పట్టాదారు పాస్‌పుస్తకంలో ఉన్న తప్పులను సరిచేసుకునేందుకు రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పొడి దుక్కుల్లో విత్తనాలు వద్దు



దుక్కిలో విత్తనాలను పరిశీలిస్తున్న అధికారులు

టేకులపల్లి: రైతులు వానాకాలం సాగు విషయంలో తొందర పడొద్దని సాగుకు అనుకూలమైన వాతావరణంలోనే వ్యవసాయ పనులు ప్రారంభించాలని, పొడి దుక్కుల్లో పత్తి విత్తనాలు విత్తొద్దని వ్యవసాయ ఏడీఏ(టెక్నికల్) శోభన్ బాబు అన్నారు. ఈ మేరకు శుక్రవారం మండల వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి మండలంలోని తొమ్మిదోమైలుతండాలో పర్యటించారు. పొడిదుక్కుల్లో పత్తి విత్తనాలు నాటిన భూమిని పరిశీలించారు. కనీసం 2–10 మీమీ వర్షపాతం వచ్చినప్పుడు మాత్రమే రైతులు విత్తనాలు విత్తుకోవాలని సూచించారు. ఎరువుల, విత్తన షాపులో స్టాక్ రిజిస్టర్, ఇన్వాయిస్, పర్మిషన్ కాపీని తనిఖీ చేశారు. బేతంపూడి సొసైటీ ఆధ్వర్యంలో పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ విధానాన్ని పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో టేకులపల్లి ఏవో అన్నపూర్ణ, ఏఈవో రమేష్, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు భక్తులు



బోనాలతో వస్తున్న భక్తులు

జూలూరుపాడు: మండలంలోని వెంగన్నపాలెం గ్రామంలో కొలువై ఉన్న శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి, శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో శుక్రవారం ప్రథమ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దేవతామూర్తులకు పంచామృతాలతో అభిషేకం, సహస్రనామార్చన, పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నాయకులు లేళ్ల వెంకటరెడ్డి, దుద్దుకూరి మధుసూదన్‌రావు, నరసింహారావు, తిప్పర్తి శివ, సున్నం ప్రసాద్, మంగయ్య, పిచ్చాచారి, వెంకటేశ్వర్లు, వెంకటాచారి, నరసింహాచారి పాల్గొన్నారు.

ప్రతిష్ట పూజలు

పాల్వంచరూరల్: మండలపరిధిలోని పాండురంగాపురంతండాలో నిర్మించిన శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో మూడు రోజులపాటు జరగనున్న విగ్రహప్రతిష్ఠాపన పూజలు తొలిరోజు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కందాల సింహాద్రి ఆనందకుమారాచార్యులు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. కొత్వాల శ్రీనివాసరావు, యర్రంశెట్టి ముత్తయ్య, ఆలయకమిటీ సభ్యులు జగదీష్‌కుమార్, బి.లక్‌పతి, కుమార్, వి.చిన్నవీరు, లాలు, జలీల్, వెంకన్న, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వందరోజుల ప్రణాళిక



నిల్వ నీరు పారబోస్తున్న సిబ్బంది



దోమల నివారణ చర్యలు

ఇల్లెందు: ఇల్లెందు మున్సిపాలిటీలో వంద రోజుల ప్రణాళికలో భాగంగా శుక్రవారం నాలుగోవార్డులో తడి పొడి చెత్త వేరు చేయటం మీద అవగాహన కల్పించారు. ఇంటింటికి చెత్త సేకరణ చేసే విధానంను వివరించారు. హోం కంపోస్టింగ్‌పై అవగాహన కల్పించారు. దోమల నివారణకు ఆయిల్ బాల్స్, స్ప్రేయింగ్ చేయించారు. ఇల్లెందు ప్రభుత్వ హాస్పిటల్‌లో మున్సిపల్ శానిటేషన్ సిబ్బందికి పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

అందుబాటులో పశు టీకాలు

సుజాతనగర్: గేదెలు, ఆవులు, మేకలు, గొర్రెల్లో సంభవించే గొంతువాపు, జబ్బవాపు, దొబ్బరోగం, చిటెకె రోగాలకు సంబంధించిన వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయని సుజాతనగర్ పశువైద్యాధికారి ఎస్.కాత్యాయని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యాక్సిన్లు అవసరమైన యజమానులు పశువులు, జీవాలను ఇంటి వద్ద ఉంచి సమాచారం ఇస్తే గ్రామానికి వచ్చి వ్యాక్సిన్లు వేస్తామని తెలిపారు.

సంక్షిప్తంగా..

కాంట్రాక్ట్ కార్మికులకు ఓటు హక్కు కల్పించాలి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో సంస్థలో పనిచేసే 32 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులకు ఓటు హక్కు కల్పించాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు రాసుద్దీన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కొత్తగూడెంలోని జిల్లా కార్యాలయంలో జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.

నూతన కమిటీ ఎన్నిక

ఈ మేరకు కొత్తగూడెం రీజియన్ కమిటీ అధ్యక్షుడిగా కొండపల్లి శ్రీనివాస్, కార్యదర్శిగా నెమెళ్ల సంజీవ్‌లను, వీరితోపాటు ఏడుగురు ఆఫీస్ బేరర్లను ఎన్నుకున్నట్లు యూనియన్ నాయకులు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు కే.సారంగపాణి, గౌని నాగేశ్వరరావు, రాధా, వాసు, శరత్, కృష్ణ, కరుణ, అంజయ్య, మంగీలాల్ పాల్గొన్నారు.



అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, సంజీవ్‌లు

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

జూలూరుపాడు: పార్టీ బలోపేతానికి కృషి చేయాలని బీజేపీ జిల్లా కార్యదర్శి బండారు నరేష్ బాబు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని పడమటనర్సాపురంలో జరిగిన పార్టీ మండల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు పరుస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలపై ప్రజలకు వివరించాలన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు భూక్యా రమేష్, ప్రధాన కార్యదర్శులు భూక్యా శ్రీను, నిమ్మటూరి రామారావు, యువ మోర్చా మండల అధ్యక్షుడు గుగులోత్ రాంబాబు, గిరిజన మోర్చా మండల అధ్యక్షుడు భూక్యా రవి, భూక్యా చరణ్, గుగులోత్ బాబులాల్, భూక్యా రమేష్, కిషన్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ ద్వారా పథకాలు అమలుచేయాలి

సుజాతనగర్: ఎస్సీ వర్గీకరణ ద్వారానే ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలుచేయాలని మాదిగ ఐక్యవేదిక సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సుజాతనగర్ తహసీల్దార్ వనం కృష్ణప్రసాద్, ఎంపీఓ శ్రీనివాస్‌లకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండల కేంద్రంలో ప్రజా మరుగుదొడ్లు, బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలన్నారు. అంతకుముందు తహసీల్దార్ కృష్ణప్రసాద్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వేల్పుల భాస్కర్, అంకిశెట్టి రామకష్ణ, దామెర్ల సర్వేశ్వరరావు, మంద రాజు, కత్తి వెంకన్న, సిరిగిరి మురళి, కత్తి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలు, ఎరువులు సరఫరా చేయాలి

జూలూరుపాడు: ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న దృష్ట్యా రైతులకు విత్తనాలు, ఎరువులు సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐయూకేఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం జూలూరుపాడు తహసీల్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సహాయ కార్యదర్శి బానోత్ ధర్మా మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని రెవిన్యూ సిబ్బందికి అందజేశారు. మండల కార్యదర్శి తోటకూరి నరేష్, తాటి నరసింహారావు, భూక్యా బాలు, నాగేశ్వరరావు, బాలకోటి, భావ్‌సింగ్, భోజ్యా, దశరథ్, పారుపల్లి కృష్ణారావు, నరేష్, బానోత్ వీరు, బాలాజీ, తిరుమలరావు, శ్రీను పాల్గొన్నారు.

సభను జయప్రదం చేయాలి



సమావేశంలో నాయకులు

సుజాతనగర్: గిరిజన హక్కుల సాధనకు ఈ నెల 8న ఖమ్మంలో జరిగే రాష్ట్ర స్థాయి ఉద్యమ కార్యాచరణ సభను జయప్రదం చేయాలని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ రాజేష్ నాయక్ పిలుపునిచ్చారు. ఆ సంఘం సమావేశాన్ని సర్వారంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కులగణనలో లంబాడీల జనాభా బహిర్గతం చేయాలని, గోర్‌బోలి భాషను అధికారికంగా గుర్తించి కేంద్ర ప్రభుత్వం 8వ షెడ్యూల్‌లో చేర్చాలని, పంచాయతీల అభివృద్ధికి ప్రత్యేక బడ్జెట్‌ను ఏర్పాటు చేయాలని, సబ్ ప్లాన్ నిధులను గిరిజనుల అభివృద్ధి కోసమే ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు పంతుల్య నాయక్, కృష్ణా నాయక్, దశరథి నాయక్, హరినాయక్, లచ్చు నాయక్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఒత్తిడి లేని విద్య

బడిబాట కార్యక్రమం ప్రారంభం

- ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ర్యాలీలతో ఇంటింటి ప్రచారం



టేకులపల్లి: బడిబాట ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

● టేకులపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రశాంత మైన వాతావరణంలో ఒత్తిడి లేని విద్య లభిస్తుందని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. ఈమేరకు శుక్రవారం కోయగూడెం గ్రామంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అదే విధంగా బోడుగ్రామంలో ఎంఈఓ అజ్మీర జగన్ నాయక్ బడిబాటను ప్రారంభించారు. మండలంలోని టేకులపల్లి, బోడు, కుంటల్ల, ముత్యాలంపాడు, సులానగర్, బొమ్మనపల్లి కాంప్లెక్స్‌ల పరిధిలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, జీపీఎస్, ఆశ్రమ, గురుకుల, కేజీబీవీ, ఏకలవ్య మొత్తం 97 ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు సిబ్బంది ఫ్లెక్సీలతో ర్యాలీలు చేసి కరపత్రాలతో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేపట్టారు. కాంప్లెక్స్ హెచ్‌ఎంలు మెరుగు శ్రీనివాస్, జోగ రవి, దేవదాసు, మంగీలాల్, రాంచందర్‌సింగ్, కార్యదర్శులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, ఐఈఆర్‌పీ టీచర్లు పాల్గొన్నారు.

● జూలూరుపాడు: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ చీఫ్ మానిటరింగ్ ఆఫీసర్ ఎస్‌కె.సైదులు, జిల్లా ప్లానింగ్ కో ఆర్డినేటర్ కె.సతీష్ అన్నారు. శుక్రవారం జూలూరుపాడు మండల వ్యాప్తంగా ప్రొఫెసర్ జయశంకర్ బడి కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మీనర్సయ్య, పంచాయతీ కార్యదర్శి హరిబాబు, సాంఘీక సంక్షేమ హాస్టల్ వార్డెన్ వెంకటేశ్వర్లు, పీఎస్ హెచ్‌ఎంలు బి.నేతాజీ, కృష్ణ, ఏఏపీసీ చైర్మన్లు ప్రశాంతి, నాగమణి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

● కొత్తగూడెంఅర్బన్: బడిఈడు పిల్లలను పాఠశాలల్లో తప్పనిసరిగా చేర్పించాలని జిల్లా సైన్స్ ఆఫీసర్, చాతకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం.చలపతిరాజు అన్నారు. ఈ మేరకు లక్ష్మీదేవిపల్లి మండలంలోని చాతకొండ పంచాయతీలో బడిబాట కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కె.సంధ్యారాణి, ఉపాధ్యాయులు అమీరుద్దీన్, సిహెచ్ నాగలక్ష్మి, పద్మ, నాగేశ్వరరావు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



జూలూరుపాడు: మాట్లాడుతున్న సైదులు



ఇల్లెందురూరల్: ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

● సింగరేణి(కొత్తగూడెం)/ సూపర్‌బజార్(కొత్తగూడెం): సర్కార్ బడికి పోదాం మేలైన విద్యను పొందుదామని మాజీ కౌన్సిలర్ భుక్యా శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు 11వ వార్డు చిట్టి రామవరం తండాలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఉషాదేవి, కిషన్, ప్రిస్కిల్లా, అంగన్వాడీ టీచర్స్ శ్రీదేవి, తులసి బాయి, ఈశ్వరి, విద్యార్థులు, తల్లితండ్రులు తదితరులు పాల్గొన్నారు.

● ఇల్లెందురూరల్: ప్రభుత్వ పాఠశాలలను ఆదరించాలని వివరిస్తూ ఉపాధ్యాయులు మండలంలోని పలు గ్రామాల్లో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పాఠశాలల్లో తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి పాఠశాల ప్రత్యేకతలను వివరించారు.



కొత్తగూడెంఅర్బన్: మాట్లాడుతున్న చలపతిరాజు



చిట్టి రామవరంలో బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు